




క్షీరా రామశీలో శివనామ స్మరణ భక్త జనావళితో కిటకిట
స్వామివారిని దర్శించుకుని అభిషేకాలను నిర్వహించిన ప్రముఖ నాయకులు భక్తులు.
పాలకొల్లు ప్రభాతవార్త

# చాట్రాయి శివాలయానికి పోటెత్తిన భక్తులు

- ఆలయ కమిటీ విస్తృత ఏర్పాట్లు
- 15 వేల మందికి పైగా అన్నదానం



చాట్రాయి, ఫిబ్రవరి15, ప్రభాతవార్త : మండల కేంద్రమైన చాట్రాయిలో వేంచేసియున్న శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా భక్తులతో కిక్కిరిసిపోయింది. శివరాత్రి పర్వదినం కావడంతో ఉదయం నాలుగు గంటల నుండి భక్తులు భారీగా తరలిరాగా స్వామివారికి ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు గావించారు. పురాతన చరిత్ర కలిగిన దేవాలయం కావడంతో భక్తులు చాట్రాయి మండలం నుండే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ గ్రామాల నుండి కూడా భక్తులు భారీగా తరలివచ్చారు. స్థానాల చెరువులో తగినన్ని నీరు ఉండటంతో పాటు ఆలయ కమిటీ జల్లు స్థానాన్ని కూడా ఏర్పాటు చేయటంతో భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పిండ ప్రదానాలు గావించారు. భక్తులు స్థానాలు ఆచరించి పితృ మాతృ దేవతలకు దర్పణాలు వదలారు. ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు బేషుగ్గా చేయటంతో భక్తులకు అసౌకర్యం కలగలేదు. స్వామివారిని దర్శించుకునేందుకు మాజీ ఎంపీపీ, బూరుగు గూడెం సర్పంచ్ దేశిరెడ్డి హైమావతి దంపతులు తదితరులు రాగా ఆలయ కమిటీ సభ్యులు గోళ్ళ సురేష్ , కాంతారావు, వెంకటేశ్వరరావు, సత్తిబాబు, చిట్టిబాబు, సత్యనారాయణ, గురునాధరావు, కృష్ణ, వలివేటి బుజ్జి, ప్రముఖ వ్యాపారవేత్త వీసం నరసింహారావు తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించగా సుమారు 15 వేల మంది వరకు పాల్గొని భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. రాత్రి శివపార్వతుల కళ్యాణం వైభవంగా నిర్వహించారు.



## 108 కేజీల పంచదారతో బాలత్రిపుర సుందరికి అలంకరణ

భీమవరం ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :భీమవరం మెంటే వారి తోటలోని శ్రీబాల త్రిపుర సుందరి అమ్మవారికి మహా శివరాత్రి సందర్భంగా 108 కేజీల పంచదారతో అలంకరణ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో దాతలు తోటకూర కృష్ణ, ఫణి లక్ష్మీ దంపతులచే ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలను, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం 108 కేజీల పంచదారతో అభిషేకం చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో భక్తులు బాలత్రిపుర సుందరి మహిళ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థికి రూ 20 వేలు సహకారం అందించిన ఎమ్మెల్యే అంజిబాబు



భీమవరం ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :ప్రతిభకు చేయూత విద్యార్థి భవితకు ఆధారమని, ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహిస్తే మరింత రాణిస్తారని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం ప్రతిభ కలిగిన విద్యార్థికి రూ 20 వేలు ఆర్థిక సహకారం అందించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ ప్రతిభ కలిగిన విద్యార్థులెందరో ఆర్థిక ఇబ్బందులతో ఉన్నత విద్యకు వెళ్లలేకపోతున్నారని, ప్రభుత్వాలు ఈ విషయంపై విద్యకు పెద్ద పీట వేస్తూ చేయూత సౌకర్యాలను కల్పిస్తుందని అన్నారు. ప్రభుత్వంతోపాటు దాతలు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. నియోజక వర్గంలో ఉన్నత విద్యకు వెళ్లలేని విద్యార్థులు ఉంటే తమ దృష్టికి తీసుకుని వస్తే వారి చదువుకు సహకారం అందిస్తామని అన్నారు. కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పట్టణంలో విష్ణు కళాశాలలో బీడీఎస్ చదువుతున్న అబ్బరాజు పవన్ కళ్యాణ్ అనే విద్యార్థికి ఫీజు నిమిత్తం భీమవరం ఎస్ఆర్ కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల రూ 20 వేలు సహకారం అందించామని అన్నారు. కార్యక్రమంలో పట్టణ యాదవ సంఘం అధ్యక్షుడు కొండ్రు శ్రీనివాస్, పవన్ కళ్యాణ్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# శివనామ స్మరణతో మారుమ్రోగిన శైవక్షేత్రాలు



పెనుమంట్ర, ఫిబ్రవరి-15, ప్రభాతవార్త: మండలంలోని ప్రధాన శైవక్షేత్రాలు మహాశివరాత్రి సందర్భంగా శివనామ స్మరణతో మారు మ్రోగాయి. మండలంలో ప్రధాన శైవక్షేత్రాలైన నత్తా రామేశ్వరం శ్రీ రామేశ్వర స్వామి ఆలయం, శ్రీ ఉమావాసుకి రవి సోమేశ్వర స్వామి ఆలయంతో పాటు మల్లిపూడి, నెగ్గిపూడి, పొలమూరు, ఆలమూరు, భట్ల మగటూరు తదితర గ్రామాల శివాలయాలు భక్తజనసందోహంతో కళకళలాడాయి. ఆదివారం తెల్లవారు జామునుండే ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. "హర హర శంభో శంకర" నినాదాలతో మారుమోగిన ఆలయ ప్రాంగణాల్లో వేలాదిమంది భక్తులు ప్రత్యేక క్యూ లైన్లలో నిలబడి పరమశివుని దర్శించుకున్నారు. రాత్రంతా జాగరణ, రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు, శివనామసంకీర్తనలు ఘనంగా నిర్వహించారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ కమిటీలు విస్తృత ఏర్పాట్లు చేపట్టాయి. వచ్చిన భక్తుల సౌకర్యార్థం అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించగా, చిన్నారులకు పాలు, త్రాగునీటి సదుపాయాలు, తీర్థప్రసాదాల పంపిణీ చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాదాయ ధర్మాదాయ శాఖ అవసరమైన చర్యలు తీసుకుంది. అలాగే పలు స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు మార్గదర్శనం, నీటి పంపిణీ, వైద్య సహాయం వంటి సేవలను అందించాయి. పోలీస్ శాఖ భద్రతా ఏర్పాట్లు చేపట్టి రద్దీ నియంత్రణలో కృషి చేసింది. రెవెన్యూ, విద్యుత్, వైద్య శాఖలు మరియు ఇతర సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలు విజయవంతం అయ్యేలా కృషి చేశారు. సాయంత్రం నిర్వహించిన రథోత్సవం వైభవంగా సాగి భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తింది.

# లక్ష్మనేశ్వరంలో నావెల్ క్యాడెట్స్ సేవలు



నరసాపురం ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :స్థానిక లక్ష్మణేశ్వరం గ్రామంలో శ్రీ వై ఎన్ కళాశాల 7(ఎ) నేవల్ యూనిట్ కి చెందిన ఎన్.సి.సి కెడెట్లు క్రమశిక్షణతో కూడిన సేవా కార్యక్రమాలను నిర్వహించారు. సామాజిక బాధ్యతలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేడెట్లు ఉత్సాహంగా పాల్గొని భక్తులకు అవగాహన కల్పించారు. ఉత్సవాల సందర్భంగా భక్తుల రద్దీని క్రమబద్ధీకరించడంలో మరియు ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులకు కేడెట్లు చేదోడు వాదోడుగా నిలిచారు. "స్వచ్ఛత హి సేవ"లో భాగంగా లక్ష్మణేశ్వర స్వామి ఆలయ పరిసరాలను మరియు ప్రధాన వీధులను కేడెట్లు శుభ్రం చేశారు. ప్లాస్టిక్ రహిత గ్రామంపై ప్రజలకు అవగాహన కల్పించారు. వృద్ధులకు, వికలాంగులకు దర్శన సమయాల్లో సహాయం చేస్తూ తమ సేవా గుణాన్ని చాటుకున్నారు. ?గ్రామ సర్పంచ్ మరియు ఆలయ కమిటీ సభ్యులు కేడెట్ల క్రమశిక్షణను, వారి సేవలను చూసి ప్రత్యేకంగా అభినందించారు. ?ఈ కార్యక్రమంలో ఎన్.సి.సి సిబ్బంది మరియు 25 మంది కేడెట్లు పాల్గొన్నారు.

# శివరాత్రి మహోత్సవములు



మొగల్తూరుఫిబ్రవరి 15 (ప్రభాతవార్త) పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు గ్రామంలో స్వయంభు గా వెలసి ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత వన మల్లికార్జున స్వయంభు లింగేశ్వర స్వామి వారి ఆలయం నందు ఆదివారం మహాశివరాత్రి మహోత్సవాలు (87వ వార్షిక మహోత్సవం) ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం స్వామివారి నగర సంచారన పల్లకి ఊరేగింపు అత్యంత వైభవంగా నిర్వహించి రాత్రి స్వామివారి కల్యాణమును ఘనంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున రెండు గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీ స్వామివారికి అభిషేకాలు జరిపారు. పొన్నపల్లి రామ్మూర్తి చల్లాయమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో వేలాదిమంది భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం కీర్తిశేషులు పొన్నపల్లి భాస్కరరావు జ్ఞాపకార్థం శ్రీ కోదండరామ భజన సమాజం (అంజి) మొగల్తూరు వారిచే తాళాల భజన భక్తులను పెద్ద ఎత్తున ఆకట్టుకుంది. మధ్యాహ్నం మూడు గంటలకు తాడేపల్లిగూడెం వారిచే వీర్నాల బాలాజీ గణపతి బుర్రకథ పార్టీ, సాయంత్రం 6 గంటలకు భీమవరం శ్రీ ఏకాదంత గణపతి సంకీర్తన బృందం జరిపారు. రాత్రి 8 గంటల నుండి 12 గంటల వరకు భక్తులచే లింగోద్భవ అభిషేకాలు అత్యంత వైభవముగా జరిపారు. మొగల్తూరు వడియారు పేట సంఘం సభ్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన పర్యవేక్షణ నిర్వహించారు.

# స్వచ్ఛంద సేవకు తరలివచ్చిన పుట్రేల భక్తులు



చాట్రాయి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త : చాట్రాయి లో వేంచేసి ఉన్న శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి దేవాలయంలో స్వచ్ఛందంగా సేవ చేసేందుకు పుట్రేల గ్రామం నుండి మహిళలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. ఆ పరమశివుడి సేవలో ఉదయం నుండి సాయంత్రం వరకు వివిధ రకాల సేవలను భక్తులకు అందించారు. ఈ పుట్రేల గ్రామ భక్త బృందం చుట్టుపక్కల ఏ ఆలయంలో ఉత్సవాలు తిరునాళ్లు జరిగినా స్వచ్ఛందంగా సేవ చేయటం కలవర్చుకున్నారు. వీరిని శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ అభినందించడంతోపాటు చిరు సత్కారాన్ని అందించారు.

## చాట్రాయి మండలంలో భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు



చాట్రాయి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త : చాట్రాయి మండలంలో పలు గ్రామాలలో శివాలయాలు మహా శివరాత్రి సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని జనార్ధనవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ జనార్దనేశ్వర స్వామి దేవాలయంలో ఉదయం నుండి ప్రత్యేక పూజలు గావించడంతో భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మండలంలోని తుమ్మగూడెం గ్రామంలో నెలకొని ఉన్న శివాలయంలో కూడా భక్తులు భారీగా దర్శనాలు చేసుకున్నారు. అదేవిధంగా పోలవరం, చిన్నంపేట, కోటపాడు, నరసింహారావు పాలెం శివారు సి.గుడిపాడు లో వేంచేసి ఉన్న రామలింగేశ్వర స్వామి దేవాలయంలో కూడా భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. చాట్రాయి మండలంలో మహాశివరాత్రి సందర్భంగా శివాలయాలు శివనామ స్మరణతో మారుమ్రోగాయి.

## శివాలయాలను దర్శించుకున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ



తణుకు, ఫిబ్రవరి 15 (ప్రభాత వార్త) :శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తణుకు నియోజకవర్గంలోని పలు శివాలయాల్లో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. తణుకు మండలం వేల్పూరు నందిరాజు పుంతలో శివాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయానికి విద్యుత్ సౌకర్యం లేని విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ అప్పటికప్పుడు విద్యుత్ సదుపాయం కల్పించి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు. అనంతరం అత్తిలి శివాలయంతోపాటు అత్తిలి మండలం ఉనికిలి గ్రామంలో వేంచేసిన శివాలయాన్ని దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా తణుకు నియోజకవర్గం ప్రజలు సుఖశాంతులతో జీవించాలని స్వామివారిని వేడుకున్నట్లు ఎమ్మెల్యే రాధాకృష్ణ వెల్లడించారు.

## శ్రీబండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి భక్తులు తాకిడి



మొగల్తూరు ఫిబ్రవరి 15 (ప్రభాతవార్త) 216 నేషనల్ హైవేను ఆనుకుని ముత్యాలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో వెలసి ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం ఉదయం భక్తులు పలు జిల్లాల నుండి పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని నైవేద్యములు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు ఈ సందర్భంగా ఆలయ ఈవో మోకా అరుణ్ కుమార్ ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు డైరెక్టర్లు గ్రామస్తులు స్థానికులు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యములు కలగకుండా దగ్గరుండి క్యూ లైన్ ఏర్పాటు చేశారు ఆలయ ఆవరణలో ఉదయం తొమ్మిది గంటలనుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు భజన కార్యక్రమం నిర్వహించారు, మహిళా భక్తులకు పసుపు కుంకుమ గాజులు పంపిణీ చేశారు

# శివాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్



తాడేపల్లిగూడెం టౌన్,ఫిబ్రవరి 15 ( ప్రభాత వార్త ):ప్రజలందరికీ శివానుగ్రహం ఉండాలని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ ఆకాంక్షించారు. మహా శివరాత్రి సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ శివాలయాలను ఆయన ఆదివారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని అన్నారు. వీరంపాలెంలో గరిమెళ్ల వేంకట రమణ శాస్త్రి శివాలయం నిర్మించి, తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి రాష్ట్ర స్థాయిలో మంచి పేరు,ప్రఖ్యాతులు తీసుకొస్తున్నారని ప్రశంసించారు. కృష్ణాయపాలెంలోని శివాలయంలో అన్న సంతర్పణ నిమిత్తం రూ.39,000 విరాళమిచ్చారు. 1వార్డులో ఉన్న విశ్వేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ కన్వీనర్ ఈతకోట తాతాజీ ఆధ్వర్యంలో స్థానిక 13 వార్డులో కాలువ గట్టున ఉన్న పెద్ద శివాలయం లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమంలో వర్తనపల్లి కాశి, చాపల రమేష్, కట్టుపోయిన వెంకటలక్ష్మి,పాలూరి వెంకటేశ్వరరావు, అడ్డగర్ల సూరి, కేతిరెడ్డి రాంబాబు, మట్ట రామకృష్ణ,నల్లగంచి రాంబాబు, వాడపల్లి సుబ్బరాజు, రామ లక్ష్మణ్, కాళ్ల గోపికృష్ణ, పసల కొండ, తాగారపు శ్రీను, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఆంధ్ర క్రికెట్ అండర్12 క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో
## ధర్మాజీ గూడెం గ్రామానికి చెందిన సొంగా అజిత్ ఎంపిక



లింగపాలెం ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :ఏలూరు సీ ఆర్ రెడ్డి కళాశాల మైదానంలో అండర్-12 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలలో లింగపాలెం మండలం ధర్మాజీగూడెంకు చెందిన సొంగా ప్రజిత్ సహాయ్ జట్టులో స్టాండ్ బై గా క్రీడాకారుడుగా ఎంపికయ్యాడు. ఈ నెల 16 నుండి 19 వరకు గుంటూరు లో జరిగే జిల్లా స్థాయి పోటీలకు ప్రాధాన్యత వహిస్తాడని సెలెక్టర్స్ లో ఒకరైనా షాకీర్ తెలిపారు .ప్రజిత్ 5 వ తరగతి ఏలూరు సీ ఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్ లో చదువుతున్నాడు. ఈ కుర్రాడి ఎంపిక పట్ల గ్రామస్థులు, యువకులు, క్రికెట్ పై ఆసక్తి ఉన్న వాళ్ళు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలలుగా వంగూరు ఏ ఎన్ ఎమ్ అకాడమీ లో శిక్షణ పొందుతున్నాడని తల్లిదండ్రులు తెలిపారు.

## 108 కేజీల పంచదారతో బాలత్రిపుర సుందరికి అలంకరణ



భీమవరం ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :భీమవరం మెంటే వారి తోటలోని శ్రీబాల త్రిపుర సుందరి అమ్మవారికి మహా శివరాత్రి సందర్భంగా 108 కేజీల పంచదారతో అలంకరణ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో దాతలు తోటకూర కృష్ణ, ఫణి లక్ష్మీ దంపతులచే ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలను, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం 108 కేజీల పంచదారతో అభిషేకం చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో భక్తులు బాలత్రిపుర సుందరి మహిళ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# శైవ క్షేత్రాల్లో మార్మోగిన 'శివహోం'నినాదం
## పోటెత్తిన 'భక్త'కోటితో పులకించిన పట్టణం



భీమవరం టౌన్, ఫిబ్రవరి 15 : ప్రభాతవార్త :శైవ క్షేత్రాల్లో ఆదివారం శివహోం నినాదం మార్మోగింది. మిన్నంటిన ఆ నినాదాలతో భీమవరం పట్టణం పులకించింది. పట్టణంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పంచారామ క్షేత్రం, సుదీర్ఘ చరిత్ర కలిగి భక్తులకు ఆధ్యాత్మికతను అలవర్చిన భీమేశ్వర స్వామి ఆలయం, మరియు ఇతర శివాలయాలు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా స్వామి దర్శనానికి విచ్చేసిన భక్త కోటితో కిటకిటలాడాయి. భక్తులు అభిషేకాలు, కుంకుమార్చనలు, పూజలు జరిపించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామి దర్శనం చేసుకుని ఆశీస్సులు పొందారు. అందరికీ సులభంగా దర్శనం కలిగేలా ఎటువంటి గలాటాలు, తోపులాటలు జరుగకుండా ( కలెక్టర్ చదలవాడ నాగ రాణి శనివారం ప్రముఖ దేవాలయాలు సందర్శించి, ఏర్పాట్లు పరిశీలించి అధి కారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు) పోలీసులు పర్యవేక్షించారు. ఎన్ సి సి విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, భక్తులు సహకరించారు. పలువురు దాతలు పులిహోర ,అల్పాహారం, త్రాగునీరు, పాలు, పండ్లు, ప్రసాదాలు అందజేశారు. దేవాలయానికి చేరుకునే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ట్రాఫిక్ పోలీ సులు పర్యవేక్షిస్తూ ట్రాఫిక్ ను క్రమ బద్ధీ కరించారు. పొరుగు జిల్లాలు, సుదూర ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాల్లో విచ్చేసిన భక్తులు ఎండను సైతం లెక్క చేయక క్యూలో బారులుదీరి నిలబడ్డారు. సులభ దర్శనం కోసం పటిష్ట ఏర్పాట్లు చేసినప్పటికీ పోటెత్తిన భక్త కోటితో దర్శనానికి చాలా సమయం పడుతుందని భక్తులంటున్నారు. సోమేశ్వర జనార్ధన స్వామి దేవాలయ కార్యనిర్వహణాధికారి రామకృష్ణంరాజు, పాలకవర్గ చైర్మన్ చింతలపాటి బంగార్రాజు, భీమేశ్వర స్వామి దేవాలయ కార్యనిర్వహణాధికారి తోట శ్రీనివాసరావు, పాలకవర్గ చైర్మన్ గనిరెడ్డి త్రినాథ్ పర్యవే క్షణల్లో పాలకవర్గ సభ్యులు, సిబ్బంది నిరంతరం భక్తులవెంట నడుస్తూ వారు ఎటువంటి అసౌకర్యాలకు గురికాకుండా స్వామివారిని దర్శించుకునేందుకు పూర్తి సహకారాన్ని అందజేస్తు న్నారు. మహాశివరాత్రి మహోత్సవాలు ముగిసే వరకు భక్తులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## స్మశాన వాటికలో మంత్రి రామానాయుడు శ్రమదానం.

ఓఎన్జిసి సిఎస్ఆర్ నిధులు 75 లక్షలు, హైదరాబాద్ బయోఫోర్ ఫార్మా కంపెనీ సిఎస్ఆర్ నిధులు 50 లక్షలతో చేపడుతున్నామన్నారు. పాలకొల్లు పట్టణంలో హిందూ స్మశాన వాటికను ఆహ్లాదకర పార్కు తరహాలో కైలాస వనంగా తీర్చిదిద్దామని, మిగిలిన అన్నిచోట్ల దశలవారీగా ఇదే రకంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాలుగోన్నవారు సర్పంచ్ కావలి లక్ష్మి కుమారి, ఏఎంసీ చైర్మన్ కోడి విజయ భాస్కర్, పాము రజని కుమార్ మామిడి శెట్టి పెద్దిరాజు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు, ఇంటి శ్రీరాముడు, కలిదిండి రామచంద్ర రాజు, రాయి ప్రసాద్, పెనుమత్స శ్రీనివాసరాజు, బొప్పన చిన్న, చెరుకూరి బాలాజీ, చందు, చిట్టి నాయుడు, కడలి గోపాలరావు మాత రత్న రాజు శ్రీ రెడ్డి బాబులు, నున్న పోయిన ప్రసాద్, గిడుగు కిరణ్, మేడిది జాన్ రాజు, ఉంగరాల నరసింహారావు, ఉంగరాల సూర్యనారాయణ, దేవరపల్లి రామకృష్ణ, బొక్క రామారావు, పోలినాటి ఏసు, నున్న బోయిన సత్యనారాయణ విప్పర్తి చిరంజీవ రావు, పోలి నాటి నాగేశ్వరరావు, నిమ్మల శ్రీధర్ నిమ్మల సారధి, కావలి శ్రీనివాస్ వేగేశ్న శ్రీహరి రాజు, గుబ్బల హరిప్రసాద్, గోనేడ వెంకట రామకృష్ణ , ఉనికిల నాగేశ్వరరావు, గబ్బి డి నరసింహారాజు, నున్న బోయిన నాగరాజు, పాలపర్తి చాంద్ రాజు, ఆరు మిల్లి చిన్ని చిట్టూరి ఆంజనేయులు కాసా, సత్య, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, తాళ్లూరు బుజ్జి, బొప్పన సురేష్ గోద కుమార్,ఆయా గ్రామాల్లో టిడిపి నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శివనామ స్మరణతో మారుమ్రోగిన శైవాలయాలు



అత్తిలి,ఫిబ్రవరి 15 (ప్రభాతవార్త ) మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని శివాలయాలు శివనామ స్మరణతో మారు మ్రోగాయి.అత్తిలిలో ప్రధాన శివాలయం అయిన ఉమా సిద్దేశ్వర స్వామి వారి ఆలయంలో తెల్లవారుజామున రెండు గంటల నుండి భక్తులు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ కమిటీ వారు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూ లైన్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో కోలాట భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ, వర్తకులు, భక్తుల సహకారంతో భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ బండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. మహాశివరాత్రి పర్వదినం ఆదివారం రావడంతో ఆలయ ప్రాంగణంలో గల సూర్యనారాయణ స్వామి వారిని కూడా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఐలూరు కాశీ ఆధ్వర్యంలో ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. అత్తిలి కుమ్మర వీధిలో గల ఉమా సోమేశ్వర స్వామి వారిని కూడా పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలో ఉనికిలి గ్రామంలో గల శివాలయాన్ని కూడా వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. మంచిలి, ఈడూరు,తిరుపతి పురం, బల్లిపాడు గ్రామాల్లో గల శివాలయాలలో మహాశివరాత్రి పర్వ దినం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



# నత్తా రామేశ్వరం రథోత్సవంలో అపశృతి

పెనుమంట్ర, ఫిబ్రవరి-15, ప్రభాతవార్త: మండలంలోని నత్తా రామేశ్వరంలో మహా శివరాత్రి సందర్భంగా ఆదివారం జరిగిన రథోత్సవంలో అపశృతి చోటు చేసుకుంది. రథం కాలిపై వెళ్లడంతో తణుకుకు చెందిన ఎం జయ భరత్ రెడ్డి (40) తీవ్రంగా గాయ పడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే 108 సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రు డకు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం తణుకు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో ఉత్సవాల్లో కొంతసేపు ఆందోళన నెలకొంది. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితి పై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.